బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 05 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

మధ్యాహ్న భోజన

# వంట సరుకుల ధరల పెంపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట సరకుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు విద్యాశాఖ సెక్రెటరీ డాక్టర్ యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం పోషణ్ పథకం కింద మధ్యాహ్న భోజనం వంట ధరలను కేంద్రం పెంచిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపు రాష్ట్రంలోనూ వంట ఏజెన్సీ మహిళలు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థికి రూ.5.45 చొప్పున చెల్లిస్తుండగా దాన్ని రూ.6.19కి పెంచారు. 6 నుంచి 8 తరగతుల పిల్లలకు రూ.8.17 చెల్లిస్తుండగా దాన్ని రూ.9.29కు పెంచారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.10.67 నుంచి రూ.11.79కి పెంచారు. ఈ ధరలు గుడ్డును మినహాయించి మిగిలిన వంట సరుకులకిచ్చేవి. కొత్త ధరలు 2024 డిసెంబరు 1వ తేదీ నుంచి వర్తించనున్నది. ఒక్కో విద్యార్థికయ్యే ఖర్చులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వెచ్చిస్తున్న విషయం విధితమే.

11 లోగా కాళేశ్వరం కేసులో

# సీబీఐ ఎఫ్ఐఆర్ చేయాలి

- కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను అరెస్టు చేయాలి
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే
- ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌ను అరెస్ట్‌కు అనుమతి ఇవ్వడం లేదు
- త్వరలో బీజేపీలో బీఆర్ఎస్ వీలినం
- సీఎం రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ రహమత్ నగర్ పీజేఆర్ సర్కిల్ వద్ద కార్నర్ మీటింగ్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎంక్వైరీ వేయాలని సీబీఐకి అప్పగిస్తే.. మూడు నెలలైనా కేసు పెట్టలేదనీ, బీఆర్ఎస్, బీజేపీ ది ఫెవికాల్ బంధం కాకపోతే.. మీరు, వాళ్లు ఒక్కటి కాదంటే ఈనెల 11లోగా కాళేశ్వరం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ చేసి.. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రహమత్ నగర్ డివిజన్‌లోని శ్రీరామ్ నగర్ క్రాస్ రోడ్ (పీజేఆర్ సర్కిల్) వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని బీజేపీ నేతలు పదే పదే చెప్పారని గుర్తు చేశారు. 'కాళేశ్వరం కేసును సీబీఐకి పంపిస్తే 48 గంటల్లో తండ్రీ కొడుకులను జైలుకు పంపిస్తామన్నారు. మీరు, వాళ్లు ఒక్కటి కాకపోతే, కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు." అని అన్నారు. ఇందులో మీ చీకటి ఒప్పందం ఏంటనీ ప్రశ్నించారు. 'చీకటి ఒప్పందం చేసుకుని జూబ్లీహిల్స్‌లో బీజేపీ బీఆర్ఎస్‌కు పరోక్ష మద్దతు ఇస్తోందన్నారు. ఎందుకంటే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుంది. ఇది నేను అంటున్నది కాదు.. వాళ్ల ఆడబిడ్డ చెబుతున్నదే' అని చెప్పారు.

'సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే ఆయన సతీమణిని గెలిపించాలని అడుగుతున్నారు. కానీ ఇదే కేసీఆర్.. 2007లో పీజేఆర్ మరణించినప్పుడు ఏం చేశారు' అని ప్రశ్నించారు. 'ఆనాడు పీజేఆర్ రాజకీయ ప్రత్యర్థి అయిన చంద్రబాబు నాయుడు సైతం విజ్ఞత ప్రదర్శించి, ఏకగ్రీవానికి అంగీకరించి పోటీ పెట్టలేదు. కానీ కేసీఆర్ మాత్రం, సెంటిమెంట్ లేదంటూ పీజేఆర్ కుటుంబంపై అభ్యర్థిని నిలబెట్టారు. మద్దతు అడగడానికి వెళ్లిన పీజేఆర్ భార్యను, కుటుంబాన్ని మూడు గంటల పాటు గేటు బయట నిలబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్,' అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పీజేఆర్ మీద పోటీ పెట్టినందుకు బీఆర్ఎస్ నేతలు రహమత్ నగర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాకే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఇంటి నుంచి బయటకు పంపిన దుర్మార్గుడు కేటీఆర్ అని విమర్శించారు. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఇప్పుడు 'ఆడబిడ్డను ఆదుకోవాలని కేటీఆర్ చెప్తున్నారు. కానీ తండ్రి సంపాదించిన ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెల్నే మెడలు పట్టి బయటకు గెంటించిన కసాయి కేటీఆర్ కాదా'? అని నిలదీశారు. 'సొంత చెల్లెలికే బుక్కెడు అన్నం పెట్టనోడు.. ఇప్పుడు మరొకరిని ఆదుకుంటాడట' అని ఎద్దేవా చేశారు. పదేండ్ల పాలనలో అయిదేండ్ల పాటు మంత్రివర్గంలో ఒక్క మహిళకూ స్థానం ఇవ్వని కేసీఆర్, కేటీఆర్‌లకు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

కాంగ్రెస్ ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలకు నాయకత్వం ఇచ్చిందని, తమ మంత్రివర్గంలో సీతక్క, కొండా సురేఖ వంటి వారికి గౌరవం ఇచ్చిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూబ్లీహిల్స్‌లోనే 14,159 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. "మేము 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే, బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ఆ పథకాన్ని ఆపాలని చూస్తున్నారు,' అని విమర్శించారు. 'మీ రేషన్ కార్డు రద్దు చేయడానికా బీఆర్ఎస్‌ను గెలిపించేది? మీ ఉచిత కరెంట్ ఆపడానికా? ఆడబిడ్డల బస్సు ప్రయాణం ఆపడానికా?' అని ప్రజలను ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే, ఎన్నికల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి 4వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలైన సీపీఐ(ఎం), సీపీఐ, ఎంఐఎం, టీజేఎస్ పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, ఇతర నేతలు ఉన్నారు.

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై

# అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై పథకం సజావుగా అమలు చేసేందుకు వీలుగా అధ్యయనానికి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్ చైర్మెన్‌గా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి వైస్ చైర్మెన్‌గా, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా ఉన్నారు. సభ్యులుగా విద్య, ఎస్సీ అభివృద్ధి, బీసీ సంక్షేమం, ఎస్టీ సంక్షేమ శాఖల కార్యదర్శులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య నుంచి ముగ్గురు ప్రతినిధులు కమిటీలో ఉన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై కమిటీ ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా, సుస్థిరంగా హేతుబద్ధంగా ఉండే ఫీ రీయింబర్స్‌మెంట్ విధానానికి అవసరమైన సూచనలను కమిటీ చేయనున్నది. అక్టోబర్ 28న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# మరో రెండు బస్సు ప్రమాదాలు..



- కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో 15 మందికి గాయాలు
- నల్గొండ జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్‌లో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు.
- రెండు ప్రమాదాల్లో మొత్తం 19 మందికి గాయాలైనట్టు సమాచారం.

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో వరుస రోడ్డు ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున (ఉదయం 5 గంటల సమయంలో) రెండు వేర్వేరు బస్సు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

**కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదం..**

కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం రేణుకుంట బ్రిడ్జి వద్ద ఈ ప్రమాదం జరిగింది. మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగం, ట్రాక్టర్ ట్రాలీ ధ్వంసమయ్యాయి.

**నల్గొండ జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం..**

మరోవైపు, నల్గొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద కూడా ఇదే తరహా ప్రమాదం చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ల నిర్లక్ష్యం లేదా పొగమంచు కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌ను

# ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సహకరించండి



- జర్మనీ సహకారం కోరిన సీఎం రేవంత్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌ను ఇన్నొవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడంలో తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్మనీకి చెందిన ప్రతినిధి బృందాన్ని కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, ప్రధానంగా ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీల పెట్టుబడులు పెట్టాలని కోరారు. జర్మనీ కాన్సులేట్ జనరల్ (చెన్నై) కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి గారితో భేటీ అయింది. జర్మనీకి చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థ డుయిష్ బోర్సా విస్తరణలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి గారిని మర్యాద పూర్వకంగా కలిసి వివరాలను అందించారు.

తాజాగా డుయిష్ బోర్సా కంపెనీ ఏర్పాటు చేస్తున్న జీసీసీ ద్వారా వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు జర్మనీ బృందం వివరించింది. జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు ఈ సందర్భంగా జర్మనీ ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు.

తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్చుకునే విషయంలో హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి సహకరించాలని ముఖ్యమంత్రి గారు కోరారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం, ఒకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించడం వంటి అంశాల్లో సహకరించాలని అన్నారు. ఈ భేటీలో డుయిష్ బోర్సా చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ క్రిస్టోఫ్ బోమ్ , జర్మనీ గౌరవ కాన్సుల్ (ఏపీ, తెలంగాణ), హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్ అమిత ఆర్ దేశాయ్ గారు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి, ప్రస్తుతం కొనసాగుతున్న డేటా సెంటర్ ప్రాజెక్టులు, తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ విస్తరణ ప్రణాళికలపై చర్చలు జరిపింది. ఈ ప్రతినిధి బృందంలో కెర్రీ పర్సన్, వైస్ ప్రెసిడెంట్ (ఏడబ్ల్యూఎస్ గ్లోబల్ ఆపరేషన్స్ అండ్ డేటా సెంటర్ డెలివరీ) విక్రమ్ శ్రీధరన్, డైరెక్టర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ పాలసీ, ఏడబ్ల్యూఎస్) అనురాగ్ ఖిల్నాని, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ డెలివరీ) తదితర సీనియర్ అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ పెట్టుబడులు, విస్తరణ కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.



# శబరిమల భక్తులకు టీవీడీబీ శుభవార్త

- పూజా, వసతి బుకింగ్స్ ఆన్‌లైన్‌లో ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాబోయే శబరిమల వార్షిక యాత్ర ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగా, అయ్యప్ప భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీవీడీబీ) శుభవార్త అందించింది. ఈ నెల 5వ తేదీ నుంచి పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం భక్తులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని బోర్డు ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, భక్తులు సులభంగా ఆన్‌లైన్ ద్వారా సేవలు పొందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. అలాగే సన్నిధానం, టెంపుల్ కాంప్లెక్స్‌లలో వసతి సదుపాయాల కోసం కూడా బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసినట్లు తెలిపింది. బుధవారం నుంచి www.onlinetdb.com వెబ్‌సైట్ ద్వారా భక్తులు తమ వసతి సదుపాయాలను ముందుగానే బుక్ చేసుకోవచ్చని వెల్లడించింది.

# బిలాస్‌పూర్ వద్ద రైళ్లు ఢీ

**బలగం టీవీ, బిలాస్‌పూర్**

ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో మంగళవారం రెండు రైళ్లు ఢీ కొన్నాయి. పాసింజర్ రైలు, గూడ్స్ రైలుతో ఢీ కొన్న ఘటనలో ఆరుగురు మరణించగా, ఐదుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కోర్బా జిల్లాలోని గెవ్రా నుంచి పాసింజర్ రైలు బిలాస్‌పూర్‌కు వెళుతోంది. గటోరా, బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య పాసింజర్ రైలు వెనుక నుండి గూడ్స్ రైలులోకి దూసుకుపోయింది. ప్రమాద తీవ్రతకు గూడ్స్ రైలు వ్యాగన్ పైకి ప్రయాణికుల రైలు కోచ్ ఒకటి పూర్తిగా ఎక్కేయడం కనిపిస్తోంది. కోచ్ కింద చిక్కుకున్న వారిని వెలికి తీయడానికి హైడ్రాలిక్ కట్టర్‌లను ఉపయోగిస్తున్నారు. బిలాస్‌పూర్ రైల్వేచీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుస్కర్ విపుల్ విలాస్‌రావు విలేకర్లతో మాట్లాడుతూ, రైళ్ళ వేగానికి సంబంధించి అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఒకే ట్రాక్‌పై ఒక రైలు వెనుక మరో రైలు వెళ్ళడమనేది సాధారణ కార్యకలాపాల్లో భాగమేనని చెప్పారు. అయితే రైల్వే భద్రతా కమిషనర్ విచారణ జరిపిన తర్వాత గానీ సరైన కారణాన్ని వెల్లడించలేమని అన్నారు.



మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5లక్షలు, స్వల్ప గాయాలైన వారికి లక్ష చొప్పున నష్టపరిహారాన్ని రైల్వే ప్రకటించింది. హెల్ప్‌లైన్‌లను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఈ ఘటనపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా బిలాస్ పూర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు.

# ఫీజులు కట్టనోడు జూబ్లీహిల్స్ అభివృద్ధి చేస్తాడా..?

- బకాయిలు అడిగితే బెదిరింపులు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఒక్కఛాన్స్ ఇవ్వండి అని కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌లో తిరుగుతోందని, మీకు ఒక్కఛాన్స్ ఇచ్చినందుకే కదా రాష్ట్రాన్ని ఆగం ఆగం చేశారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ రోజుల్లో కరెంట్... నీళ్లకు కట్టకటా ఉంటే బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌తో కలిసి మంగళవారం సాయంత్రం సోమాజిగూడ డివిజన్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మాగంటి సునీతా గెలుపు పక్కా అయిందని, ఇక మెజార్టీమాత్రమే తేలాల్సిఉందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 2023న ఎలాంటి ఫలితాలను చూపించామో అదే రిపిట్ అవుతుందన్నారు. హైదరాబాద్ మహానగరం ఒక అమ్మలాంటి నగరమని, అందరికి అన్నంపెట్టే అమ్మ హైదరాబాద్ అన్నారు. అందరికి కల్పతరువు లాంటి నగరం కులం, మతం, ప్రాంతం ఏదైనా కావచ్చు అందరిని కడుపులో పెట్టుకునేది హైదరాబాద్ అన్నారు. 2014లో తెలంగాణ సాధించుకునే సమయానికి ఆనాటి రోజులు ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ఆ రోజుల్లో ప్రతి రోజు పవర్‌కట్ అయ్యేదని, పరిశ్రమలు నడిచే పరిసిత్థిలేదన్నారు. అపార్టుమెంట్స్‌కుపోతే జనరేటర్లు, చిన్నచిన్న దుకాణాలు, ఆఖరికి జిరాక్స్ సెంటర్లకు వెళ్లినా ఇన్‌వైటర్లు దర్శనమిచ్చే పరిస్థితి ఉండేదన్నారు. తాగునీళ్లకు కటకట, ఇక ఎండాకాలం వచ్చిందంటే చాలు పీజేఆర్ నాయకత్వాంలో వాటర్‌బోర్డు వద్ద ధర్నాలే ధర్నాలు ఉండేవని, ఖాళీ బిందెలు, ఖాళీ కుండలతో లొల్లిలొల్లి ఉండేదని ఎద్దేవా చేశారు. ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో ఏడాది కాలంలోనే కరెంట్ సమస్య తీర్చుకుని 24గంటపాటు కరెంట్ వచ్చిందని, ఇన్‌వైటర్లు, జనరేటర్లు మాయం అయ్యాయన్నారు. పరిశ్రమలు నడవడంతో కార్మికులకు మూడుపూటల అన్నం దొరికేవిధంగా కార్యక్రమాలను చేసుకున్నామన్నారు. కృష్ణా, గోదావరి నుంచి 100 కిలోమీటర్ల మంచినీరును తీసుకొచ్చి నీళ్ల సమస్యను తీర్చుకున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది హైదరాబాద్‌కు వస్తారని వారందరికి ఉపాధి అవకాశాలు లభించేవిధంగా పరిశ్రమలను, యాపిల్, గూగుల్, అమెజాన్ లాంటి ఐటీ, ఎక్ట్రానిక్ లాంటి కొత్తకొత్త పాలసీలను తీసుకొచ్చామని గుర్తు చేశారు. మూడు లక్షలున్నా ఐటీ ఉద్యోగులను కేసీఆర్ నాయకత్వాంలో 10లక్షల మంది ఉద్యోగులుగా పెంచుకున్నామన్నారు. ఐటీ రంగం పెరగడంతో రియల్‌ఎస్టేట్ రంగం పెరిగిందని, దాంతో వ్యాపారం, వాణిజ్యం పెరిగిందన్నారు. 10ఏండ్లలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇప్పుడు ఏమైంది, అభివృద్ధి, సంక్షేమంలో రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో, అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిందన్నారు. దళితబంధు, బీసీ బంధు ఏమైందన్నారు. రాహుల్‌గాంధీ మాటలు విని యువకులు మోసపోయారన్నారు. వైఎస్ తీసుకొచ్చిన ఫీజ్‌రియంబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యాసంస్థలను బెదిరిస్తున్నారని ఆరోపించారు.



ఫీజులు కట్టనోడు జూబ్లీహిల్స్ అభివృద్ధి చేస్తామంటే నమ్ముద్దామా అని అడిగారు. ఉద్యోగులను, పెన్షనర్లను సైతం మోసం చేసింద్రు అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులను, విద్యాసంస్థలను, పరిశ్రమలతోపాటు అన్ని రంగాలవారిని బెదిరించి మీరు నడుపుతున్నది సర్కారా, రౌడీ ధర్బారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూలగొట్టడమేనా అన్నారు. పేదల ఇండ్లను కూలగొడుతున్న హైడ్రా పెద్దల జోలికి ఎందు వెళ్లడం లేదని ప్రశ్నించారు. మంత్రులు, బడాబాబుల ఇండ్లలోకి వెళ్లని హైడ్రా గరీబోళ్ల ఇండ్లకు పోయి నిర్దాక్షణంగా ఇండ్లను కూల్చివేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బుల్డోజర్‌కు అడ్డుపడేది బీఆర్ఎస్సేనని, బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రిరాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

# మంత్రి అజహరుద్దీన్‌కు శాఖల కేటాయింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ అజహరుద్దీన్‌కు ప్రభుత్వం శాఖల్ని కేటాయించింది. ఆయనకు మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల్ని కేటాయించారు. అజహరుద్దీన్ గత నెల 31న రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మైనారిటీ సంక్షేమశాఖ బాధ్యతల్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నిర్వహిస్తున్నారు. ఆయనకు ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖలు కూడా ఉన్నాయి. దీనితో మైనారిటీ సంక్షేమాన్ని ఆయన నుంచి తొలగించి, అజహరుద్దీన్‌కు అప్పగించారు. ప్రభుత్వరంగ సంస్థల శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉంది. దాన్ని కూడా మంత్రి అజహరుద్దీన్‌కు కేటాయించారు.

# కుండపోత వర్షం రైతులు ఆగం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మంగళవారం కురిసిన కుండపోత వర్షంతో రైతులు ఆగమయ్యారు. అకాల వర్షానికి వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. మంగళవారం ఉదయం ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన ఈ కుండపోత వర్షానికి మార్కెట్ లో ఆరబోసిన మక్కలు నీటిలో కొట్టుకుపోయాయి. మార్కెట్ అధికారులు సకాలంలో పరదాలు ఇవ్వకపోవడం వల్లనే తమ ధాన్యం తడిసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 27న ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా సీసీఐ, మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు మాత్రం కొనుగోలు చేయడం లేదు. సీసీఐ కూడా నామమాత్రంగా కేవలం 2771 క్వింటాళ్లు పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. ఎనుమాముల మార్కెట్‌కు మంగళవారం మొత్తం పత్తి 5000 బస్తాలు రాగా మార్కెట్ అధికారులు సకాలంలో పరదాలు ఇవ్వకపోవడం వల్ల సుమారు 2000 బస్తాలు తడిసిపోయాయి. అక్టోబర్ మొదటి వారం నుంచి ఇప్పటివరకు కొత్త పత్తి మొత్తం 57,863 క్వింటాళ్లు రాగా గరిష్టంగా ధర రూ. 6920, కనిష్ట ధర రూ.5,000 పలకగా మోడల్ ధర రూ.6300 పలికింది.

# మాయమాటలతో అధికారంలోకి కాంగ్రెస్

- ఎన్నికల ప్రచారం మీద ఉన్న శ్రద్ధ పత్తి రైతులపై ప్రభుత్వానికి లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**బలగం టీవీ, ఆదిలాబాద్**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదిలాబాద్‌లో నిర్వహించిన 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ, స్థానిక సమస్యలపై ప్రభుత్వ వైఖరిని గట్టిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రజల సమస్యలను తెలుసుకునే లక్ష్యంతో చేపట్టినట్లు ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం మీద ఉన్న శ్రద్ధ పత్తి రైతులపై ప్రభుత్వానికి లేదని కవిత విమర్శించారు. పత్తి సీజన్ మరియు మొంథా తుపాను ప్రభావం ఉన్నప్పటికీ, ప్రజా ప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. పత్తి తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన అంగీకరించారని తెలిపారు. ఈ విషయంలో సీసీఐ ఛైర్మన్ మరియు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌తో మాట్లాడి పత్తి రైతులకు మేలు చేస్తానని హామీ ఇచ్చారు.

వరంగల్ రైతు డిక్లరేషన్ మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతు సంతోషంగా లేడు. బోనస్ ఇవ్వడం లేదు, రైతు భరోసా పూర్తి స్థాయిలో లేదు, యూరియా కొరత, కరెంట్ కోతలు ఉన్నాయని ఆరోపించారు. తలమడుగు మండలంలో పత్తి రైతు ఆత్మహత్య చేసుకోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

చనాఖా–కొరటా ప్రాజెక్టు వ్యయం రూ. 300 కోట్ల నుండి రూ. 2000 కోట్లకు ఎందుకు పెరిగిందో బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనులు 90% పూర్తయ్యాయని, మహారాష్ట్రతో మాట్లాడి మరో 10 శాతం పనులు తక్షణమే పూర్తిచేసి 50 వేల ఎకరాలకు నీళ్లివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు మహారాష్ట్ర వైపు బండ్ కట్టారు కానీ, మన వైపు బండ్ కట్టడంలో ప్రజా ప్రతినిధులకు శ్రద్ధ లేదని విమర్శించారు. కుప్తి ప్రాజెక్టులో ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా తీయలేదని, సిరిచెలిమ వద్ద కూడా ప్రాజెక్టు చేపట్టాలని కోరారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చడానికి జాగృతి పోరాటం చేస్తుందని ప్రకటించారు. కొమురం భీమ్ కాలనీలో వెయ్యి మంది ఆదివాసీ తెగల నివాస సమస్యను పరిష్కరించాలని, గవర్నర్‌ను కలిసి పట్టాలు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మావాలాలో 181 ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్ద వాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. బోథ్ వెల్ఫేర్ స్కూల్ భవనం లేకపోవడంతో ఆదిలాబాద్‌లో నడుపుతున్నారని, వెంటనే బిల్డింగ్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిర్మిస్తామన్న వంద పడకల ఆస్పత్రిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. జైనత్ టెంపుల్‌లో గర్భగుడిలో నీళ్లు వస్తున్నాయని, స్థానిక ఎంపీ నగేష్ గారు తన నిధుల నుంచి రూ. 20 లక్షలు ఇవ్వాలని, తాను కూడా సాయం చేస్తానని తెలిపారు. ఈ ప్రాంతాన్ని మంచి టూరిస్ట్ సర్కిల్‌గా అభివృద్ధి చేయాలన్నారు.

ఐటీ టవర్ పూర్తయ్యాక కంపెనీలు వచ్చేలా మంత్రి శ్రీధర్ బాబు కృషి చేయాలి. ఎయిర్ పోర్ట్ కోసం టౌన్ మధ్యలో కాకుండా ఊరు బయట ప్రభుత్వ భూమిని చూడాలన్నారు. రైల్వే బ్రిడ్జిల సమస్య పరిష్కారానికి స్థానిక ఎంపీ రైల్వే మంత్రితో మాట్లాడాలి. తరుణం బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలి. ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవడంతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు బంద్ చేస్తున్నాయని, ఈ పరిస్థితికి ప్రభుత్వం సిగ్గుపడాలని మద్దతు తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పనిచేయాలని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న హామీ దిశగా చర్యలు లేవని విమర్శించారు.సామాజిక తెలంగాణ సాధనయే తమ లక్ష్యమని కవిత పునరుద్ఘాటించారు. జాగృతిని మళ్లీ బలోపేతం చేసి ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. నాలుగు నెలల పాటు ప్రజలతో మమేకమైన తర్వాతే భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటామని, ఫిబ్రవరి 13 నాటికి జనం బాట పూర్తవుతుందని తెలిపారు. తమ అజెండా నచ్చిన వారికి, నచ్చని వారికి కూడా స్వాగతం పలుకుతున్నామని పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ గేమ్స్ బారిన పడి కానిస్టేబుల్ ఆత్మహత్య

- సూసైడ్ నోట్ పంపి రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య

**బలగం టీవీ, సంగారెడ్డి**



ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై లక్షల రూపాయల అప్పుల పాలైన ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. చనిపోయే ముందు 'వెల్‌విషర్స్' పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సూసైడ్ నోట్ పంపడం కలకలం రేపింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలో నివసిస్తూ, సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కటారి సందీప్ కుమార్ (25) అనే యువకుడు ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడు. గత కొంతకాలంగా సందీప్ కుమార్ ఆన్‌లైన్ గేమ్స్‌కు పూర్తిగా బానిసగా మారిపోయాడు. ఈ వ్యసనం కారణంగా లక్షల రూపాయల్లో అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన సందీప్, చివరికి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై తన వద్ద ఉన్న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయేముందు, 'వెల్‌విషర్స్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి, అందులో ఒక సూసైడ్ నోట్‌ను పోస్ట్ చేశాడు. ఆ నోట్‌లో తన తల్లి, చెల్లిని ప్రస్తావిస్తూ, "మా అమ్మ, చెల్లిని ఎవరూ ఏమీ అనకండి. నేను ఉన్నప్పుడు వాళ్లను టార్చర్ పెట్టాను. సారీ అమ్మ, చెల్లి" అని పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా, కానిస్టేబుల్ ఆత్మహత్యకు ఉపయోగించిన రివాల్వర్ ఎక్కడి నుంచి వచ్చింది అనే విషయంపై లోతుగా విచారిస్తున్నట్లు తెలిపారు.



# శృంగేరి పీఠాధిపతులకు ఘన వీడ్కోలు..

- శృంగేరి పీఠానికి బయలుదేరిన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి

**బలగం టీవీ, హైదరాబాద్:**

దక్షిణమ్నాయ శ్రీ శారద శృంగేరి పీఠం జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామి వారు మంగళవారంనాడు ప్రత్యేక విమానంలో శృంగేరి పీఠానికి బయలుదేరుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, నల్లకుంట శంకర మఠం ధర్మాధికారులు, తెలంగాణ శృంగేరి పీఠం బాధ్యులు రాధాకృష్ణ శర్మ తదితరులు భక్తులతో కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. జగద్గురువులు శ్రీ శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి సంపూర్ణ అనుగ్రహ ఆశీస్సులతో తత్కరకమల సంజాతులు అయిన శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామి వారు ధర్మవిజయ యాత్రలో భాగంగా 18 రోజులు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించారు.

ఈ యాత్రలో భాగంగా స్వామి వారు హైదరాబాద్, కొంపల్లి, బాసర, వేములవాడ వంటి ముఖ్య ప్రాంతాలతో పాటు భాగ్యనగరంలోని పలు క్షేత్రాలను సందర్శించారు. ఈ 18 రోజుల పర్యటనలో అనేక మంది భక్తులు స్వామి వారి అనుగ్రహ ఆశీస్సులు, అనుగ్రహ భాషణం అందుకున్నారు. వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వామివారిని వేములవాడ రాజన్న ఆలయానికి ఆహ్వానించి, ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల గురించి వివరించారు. సుదీర్ఘ ధర్మ విజయ యాత్ర ముగించుకుని తిరిగి శృంగేరి పీఠం చేరుకుంటున్న సందర్భంగా స్వామి వారికి పలువురు ప్రముఖులు, భక్తులు వీడ్కోలు పలికారు.

# సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి..



- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పత్తి కొనుగోళ్లు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సీసీఐ, మార్కెటింగ్ ఇతర శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు ఉన్నాయని అన్నారు. రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు పొందాలని పిలుపు నిచ్చారు.పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ. 7689 నుంచి 8110 మద్దతు ధర ఉందని అన్నారు. కపాస్ కిసాన్లో రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు వసతులు కల్పించాలని, సీసీఐ కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ కార్యాలయాలు, రైతు వేదికల్లో రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు సహాయం చేయాలని అన్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో 42 మంది రైతుల నుంచి 852 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సీసీఐ సీపీఓ రఘురామ్, అగ్నిమాపక శాఖ, రవాణా శాఖ అధికారులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' హామీలు అమలు చేయాలి..

- బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు..

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**



బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2025లో బిల్ నెం. 3 మరియు 4 ద్వారా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఆమోదించింది. ఈ బిల్లులు గత 7 నెలలుగా కేంద్రం వద్ద తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి, కేంద్రంపై ఒత్తిడి పెంచి, ఈ బిల్లుల అమలుకు చర్యలు చేపట్టాలి. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ 42% రిజర్వేషన్ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సమితి డిమాండ్ చేసింది.

42% రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ చేపట్టడం ద్వారా అత్యంత వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలని కోరింది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ?20,000 కోట్లు ఖర్చు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, మొదటి సంవత్సరంలో కేటాయించిన ?9,200 కోట్లలో కేవలం ?2,068 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని సమితి నాయకులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం ఈ ఆర్థిక సంవత్సరంలోగా తక్షణమే మొత్తం ?40,000 కోట్లు ఖర్చు చేయాలని మరియు డిక్లరేషన్‌లో చేసిన అన్ని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని నామినేటెడ్ పోస్టులు, కమిషన్లు, బోర్డులు మరియు సలహా మండళ్లలో బీసీ, ఎస్.సి, ఎస్.టి లకు 42 శాతం ప్రాతినిధ్యం ఇవ్వాలని సమితి డిమాండ్ చేసింది. ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, తగు ప్రాతినిధ్యం మరియు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమని తాము గట్టిగా నమ్ముతున్నామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి తెలియజేసింది. ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలి

- రెడ్డి సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



తెలంగాణ రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్? లోని ఇందిరా పార్క్ లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రోజున నిరసన దీక్ష చేపట్టారు. రెడ్డి సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి స్వయంగా ఈ ఆందోళనలో పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసించారు.ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు రాష్ట్ర రెడ్డి సంఘాల పిలుపు మేరకు ఇందిరా పార్క్ వద్ద జరిగిన రెడ్ల నిరసనసభలో పాల్గొని భవిష్యత్తులో రెడ్డి సంఘాల పిలుపు మేరకు రెడ్డిల హక్కుల కోసం అలాగే నిరుపేద రెడ్డికి న్యాయం జరిగే వరకూ ఎంతవరకైనా పోరాడుతామని వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మన రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి గతంలో హామీ ఇచ్చిన విధంగా తక్షణమే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నేతలు ఈ సందర్భంగా బలంగా డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానికోసం తగిన నిధులు కేటాయించాలని కోరారు. అలాగే ఈరోజు జరిగిన నిరసన సభలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్క రెడ్డి బంధువునికి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్ల నిరసన దీక్షలో జిల్లాలోని పలువురు రెడ్డి సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మన రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి సుమారు 100 మంది రెడ్డి కుల బంధువులు పాల్గొన్నారు లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి అబ్బడి అనిల్ రెడ్డి గుర్రాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సినిమా టికెట్, పాప్‌కార్న్ ధరలపై సుప్రీంకోర్టు ఆందోళన

- ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి
- లేకపోతే థియేటర్లు ఖాళీ అవుతాయి
- ధర్మాసనం హెచ్చరిక

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్లు, పాప్‌కార్న్, ఇతర పానీయాల అధిక ధరలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా టికెట్, పాప్‌కార్న్ ధరలను నిర్ణయించాలి. లేనిపక్షంలో ప్రజలు సినిమాహాళ్లకు రావడం మానేసి ఓటీటీ వేదికలకు మొగ్గు చూపుతారు. అప్పుడు థియేటర్లు ఖాళీ అవుతాయి," అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**కర్ణాటక టికెట్ ధర పరిమితి -మల్టీప్లెక్స్ అసోసియేషన్ సవాలు**

కర్ణాటక ప్రభుత్వం ఇటీవల మల్టీప్లెక్స్ టికెట్ ధరలను రూ. 200లకు పరిమితం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన



ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ధర్మాసనం ఈ సందర్భంగా మల్టీప్లెక్స్‌ల అధిక ధరలపై తీవ్రంగా స్పందించింది. "ఒక నీళ్ల బాటిల్‌కి రూ.100, కాఫీకి రూ.700 వసూలు చేస్తున్నారు. ఇలాంటి ధరలు ప్రజలకు అందుబాటులో లేవు. ధరలు తగ్గిస్తే పరిశ్రమ బాగుపడుతుంది, లేకపోతే ప్రేక్షకులు రాక థియేటర్లు ఖాళీ అవుతాయి," అని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ, "సినిమా బిజినెస్ ఇప్పటికే కష్టాల్లో ఉంది. ప్రజ లు రావాలంటే ధరలు రీజనబుల్‌గా ఉండాలి," అని సూచించారు. హైకోర్టు నిర్ణయించిన రూ.200 టికెట్ ధర పరిమితిని సుప్రీంకోర్టు సమర్థించింది.

పిటిషనర్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ, "ధరలను నిర్ణయించడం మల్టీప్లెక్స్‌ల స్వేచ్ఛ. తాజ్ హోటల్ కాఫీకి రూ.1000 వసూలు చేస్తే దానిపై ఎవరు జోక్యం చేసుకుంటారు? ఇది కూడా అలాంటిదే," అని వాదించారు. అదేవిధంగా, హైకోర్టు మధ్యంతర ఆదేశాలు అమల్లో సాధ్యం కావని రోహత్గీ అభ్యంతరం వ్యక్తం చేశారు. "టికెట్ కౌంటర్లలో కొనుగోలు చేసే ప్రతి ఒక్కరి ఐడీ వివరాలు సేకరించాలన్న ఆదేశం అవాస్తవం. ఎక్కువ టికెట్లు ఇప్పుడు ఆన్‌లైన్ వేదికల ద్వారా అమ్ముడవుతున్నాయి," అని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది స్పందిస్తూ, "ప్రేక్షకులు అధికంగా చెల్లించిన ధరను తిరిగి చెల్లించేందుకు (రిఫండ్) వీలుగా ఉండేందుకే హైకోర్టు ఆ ఆదేశం జారీ చేసింది," అని వివరించారు. ఇరువైపుల వాదనలు విన్న సుప్రీంకోర్టు, పిటిషన్లపై నోటీసులు జారీ చేసింది. అయితే, హైకోర్టు విధించిన మధ్యంతర షరతులు (టికెట్ కొనుగోలుదారుల ఐడీ సేకరణ వంటి) అంశాలపై తక్షణ స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## మ్యాచ్ మధ్యలో కుప్పకూలి ఫుట్‌బాల్ కోచ్ మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫుట్‌బాల్ మైదానంలో విషాదం చోటు చేసుకుంది. సెర్బియాకు చెందిన ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ మ్లాడెన్ జిజోవిక్ మ్యాచ్ మధ్యలోనే కుప్పకూలి మరణించారు. సెర్బియా సూపర్ లిగా మ్యాచ్ జరుగుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రడ్నికి 1923 క్లబ్ జట్టు కోచ్‌గా ఉన్న జిజోవిక్, మ్లాడొస్ట్ లుకానీ జట్టుతో జరుగుతున్న పోటీలో 22వ నిమిషంలో అకస్మాత్తుగా కుప్పకూలారు. తక్షణమే సహచరులు మరియు వైద్య సిబ్బంది మైదానంలోనే ప్రాథమిక చికిత్స అందించి, సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే జిజోవిక్ మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆట ప్రారంభానికి కొద్ది సేపటి ముందు వరకు ఆటగాళ్లతో మాట్లాడి ఉత్సాహపరిచిన కోచ్ ఇక లేరనే విషయం ఆటగాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. జిజోవిక్ మరణవార్త తెలిసిన వెంటనే ఇరు జట్ల ఆటగాళ్లు తీవ్ర షాక్‌కు గురై మ్యాచ్‌ను రద్దు చేశారు. ఫుట్‌బాల్ అభిమానులు, సహచరులు ఆయన ఆకస్మిక మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో ముగ్గురు భారత క్రికెటర్లు

**స్మృతి, జెమిమా, దీప్తికి స్థానం**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ ప్రపంచకప్ విజయం సాధించిన నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన ఉమెన్స్ వన్డే వరల్డ్‌కప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో ముగ్గురు భారత క్రికెటర్లకు చోటు దక్కింది. భారత్ జట్టుకు చెందిన స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ ఐసీసీ ప్రకటించిన ఉత్తమ జట్టులో స్థానం సంపాదించారు. ఈ ముగ్గురు ఆటగాళ్లు భారత్ సాధించిన చారిత్రాత్మక విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి వన్డే వరల్డ్‌కప్ టైటిల్‌ను గెలుచుకుంది. అయితే టోర్నీలో నిలకడగా రాణించిన ప్రతీకా రావల్కు మాత్రం గాయం కారణంగా జట్టులో అవకాశం లభించలేదు. రన్నరప్ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల నుంచి ముగ్గురు చొప్పున ఆటగాళ్లు ఐసీసీ జట్టులో చోటు దక్కించుకున్నారు.

స్మృతి మంధాన: టోర్నీలో 54.25 సగటుతో 434 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ (న్యూజిలాండ్‌పై 109) మరియు రెండు హాఫ్‌సెంచరీలు (ఆస్ట్రేలియాపై 80, ఇంగ్లండ్‌పై 88) ఉన్నాయి.

జెమిమా రోడ్రిగ్స్: 58.40 సగటుతో 292 పరుగులు చేసింది. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అజేయంగా 127 పరుగులు చేసి టీమిండియా ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించింది.

దీప్తి శర్మ: టోర్నీలో అద్భుత ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైంది. బ్యాట్‌తో 215 పరుగులు, బంతితో 22 వికెట్లు తీసింది. ఫైనల్‌లో ఐదు వికెట్లు (39 పరుగులు ఇచ్చి) పడగొట్టి, బ్యాటింగ్‌లో 58 పరుగులు చేసింది.

**ఐసీసీ ఉమెన్స్ వన్డే వరల్డ్‌కప్ - టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్**

స్మృతి మంధాన (భారత్), లారా వోల్వార్డ్ (కెప్టెన - దక్షిణాఫ్రికా), జెమిమా రోడ్రిగ్స్ (భారత్), మారిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా), ఆష్లీ గార్డ్నర్ (ఆస్ట్రేలియా), దీప్తి శర్మ (భారత్), అన్నాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా), నాడిన్ డి క్లెర్క్ (దక్షిణాఫ్రికా), సిద్రా నవాజ్ (వికెట్ కీపర్ - పాకిస్తాన్), అలానా కింగ్ (ఆస్ట్రేలియా), సోఫీ ఎక్లెస్టోన్ (ఇంగ్లండ్) 12వ ప్లేయర్ :నాట్ స్కైవర్ బ్రంట్ (ఇంగ్లండ్)




## నవంబర్ 21న 'మస్తీ 4'

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్‌లో ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తిన 'మస్తీ' ఫ్రాంచైజీ మరోసారి రాబోతోంది. ప్రముఖ నటులు రితేశ్ దేశ్‌ముఖ్, వివేక్ ఒబెరాయ్, ఆఫ్తాబ్ శివదాసాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మస్తీ 4' నవంబర్ 21న విడుదల కానుంది. ఈ చిత్రానికి మిలన్ జవేరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రేయ శర్మ, రూహి సింగ్, ఎల్నాజ్ నోరౌజి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రబృందం తాజాగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. మునుపటి మస్తీ సిరీస్‌ల మాదిరిగానే కామెడీ, గందరగోళం, వినోదంతో నిండిన ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంటోంది. 'మస్తీ 4'ను పూర్వ చిత్రాల కంటే మరింత మసాలా, ఆధునిక హాస్యంతో తెరకెక్కించినట్లు దర్శకుడు మిలన్ జవేరి తెలిపారు.

## కన్నడ, తెలుగు సీరియల్ నటికి వేధింపులు

- నిందితుడు అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**



కన్నడ, తెలుగు టెలివిజన్ సీరియల్స్‌లో నటించే ఓ నటి సోషల్ మీడియా వేదికగా తనను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులను ఆశ్రయించారు. నటి ఫిర్యాదు మేరకు బెంగళూరులోని అన్నాపూర్ణేశ్వరి నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, నటి వేధింపుల కేసులో నిందితుడు నవీన్ అనే వ్యక్తి. అతడు ఫేస్‌బుక్‌లో నటికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపడంతో ఈ వేధింపులు ప్రారంభమయ్యాయి. రిక్వెస్ట్‌ను తిరస్కరించిన తర్వాత కూడా అతడు అసభ్యకరమైన సందేశాలు, వీడియోలు పంపడం ప్రారంభించాడు. అనంతరం నటి అతన్ని బ్లాక్ చేసినా, నకిలీ ఖాతాల ద్వారా మళ్లీ వేధింపులు కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన తర్వాత జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది అని పోలీసులు వెల్లడించారు.

## జాతీయ అవార్డులపై ప్రకాశ్ రాజ్ సంచలన వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**



సినీ నటుడు ప్రకాశ్ రాజ్ మళ్లీ తన వ్యాఖ్యలతో సంచలనానికి కారణమయ్యారు. జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రక్రియపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అవార్డులు రాజీ పడి, కొద్దిమందికే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు ఆయన గళంలో వినిపించాయి. ఇటీవల కేరళ రాష్ట్ర ఫిల్మ్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా వ్యవహరించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"కేరళ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు గర్వంగా ఉంది. వారు నన్ను పిలిచినప్పుడు 'మేము జోక్యం చేసుకోము, నిర్ణయం పూర్తిగా మీది' అని స్పష్టంగా చెప్పారు. కానీ జాతీయ అవార్డుల విషయంలో అలా జరగడం లేదు. అవార్డుల ప్రక్రియలో రాజకీయాలు, ప్రభావాలు ముద్రవేస్తున్నాయి. ఇది మనమంతా కళ్లారా చూస్తున్నాం" అని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జాతీయ అవార్డుల విధానాన్ని ఆయన తీవ్రంగా విమర్శిస్తూ, "కొందరికే అవార్డులు వెళ్తున్నాయి. 'మంజుమ్మెల్ బాయ్స్', 'భ్రమయుగం' వంటి అద్భుత చిత్రాలకు గౌరవం దక్కడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్ముట్టి లాంటి గొప్ప నటుడికి అవార్డులు అవసరం లేదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ రాజ్ సినీ పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. దర్శకులు, రచయితలు పెద్దలు, యువతతో పాటు పిల్లలను కూడా సమాజంలో భాగంగా పరిగణించాలని సూచించారు. "పిల్లల కోసం మరిన్ని మంచి చిత్రాలు తీయడం గురించి ఆలోచించాలి. వారు కూడా మన కథలలో భాగం కావాలి" అని ఆయన అన్నారు.

## ప్రభాస్‌తో నటించాలనే కోరికను వెల్లడించిన నేషనల్ క్రష్

**బలగం టీవీ, హైదరాబాద్**



నేషనల్ క్రష్‌గా పేరొందిన రష్మిక మంధాన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం రష్మిక కెరీర్‌లో మొదటి ఫీమేల్ ఓరియెంటెడ్ మూవీ కావడంతో అభిమానుల్లో ఆసక్తి తారస్థాయిలో ఉంది. ప్రస్తుతం రష్మిక మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ఆమెకు సంబంధించిన ఒక ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇటీవల రష్మిక తన అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానమిచ్చారు. ఓ అభిమాని "మీరు ప్రభాస్‌తో నటిస్తే థియేటర్‌లోనే హైప్‌తో చచ్చిపోతాం" అని కామెంట్ చేయగా, రష్మిక నవ్వుతూ స్పందిస్తూ, "నాకు ఇది చాలా ఇష్టం! ప్రభాస్ ఈ మెసేజ్ చూస్తారని ఆశిస్తున్నాను. మేమిద్దరం త్వరలో ఏదైనా స్పెషల్ ప్రాజెక్ట్‌లో కలిసి పనిచేస్తే బాగుంటుంది"అని రిప్లై ఇచ్చారు. ఆ సమాధానం కాసేపట్లోనే వైరల్ అయి సోషల్ మీడియాలో ట్రెండ్‌గా మారింది.

## సస్పెన్స్ థ్రిల్లర్ 'తారకేశ్వరి' 7న విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




శ్రీకరణ్, అనూష, షన్ను హీరోహీరోయిన్లుగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తారకేశ్వరి' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు కూడా వెంకట్‌రెడ్డి నంది చేపట్టారు. సినిమా విడుదలకు ముందు హైదరాబాద్‌లో ప్రీ-రిలీజ్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, "'తారకేశ్వరి' ఒక సస్పెన్స్, ఎమోషన్ మేళవించిన థ్రిల్లర్. అన్ని వయసువారూ కుటుంబసభ్యులతో కలిసి చూడదగిన చిత్రం ఇది" అని తెలిపారు. హీరోహీరోయిన్లు శ్రీకరణ్, అనూష, షన్ను మాట్లాడుతూ ఈ సినిమాలో భాగం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. చిత్ర యూనిట్ సభ్యులతో పాటు అన్విక ఆడియో అధినేత సంజీవ్ మేగోటి, నటులు కుప్పిలి శ్రీనివాస్, ఘర్షణ శ్రీనివాస్ ఈ వేడుకలో పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.